# వ్యాస కౌముది



**మనభారతం** **డా.వల్లూరుపల్లి శివాజీరావు**

## 6.హిందూమతం ఇతర మతాలను ఎలా ప్రభావితం చేసింది?

ఈ భూమండలంలో అద్వితీయమైన,అసమానమైన సంపద, నాగరికత, సంస్కృతి, జ్ఞాన, విజ్ఞాన ప్రతిభలతో వేలాది సంవత్సరాలు(బ్రిటన్ మనదేశాన్ని కబళించడం మొదలు పెట్టిన 1757 వరకూ) తులతూగిన మన భారతదేశపు ఔన్నత్య చరిత్రగురించి నేను వ్రాసిన "ది గ్లోబల్ ఇండియా" అనే పేరుతో ఉన్న పుస్తకం జూలై 2009లో ఇండియాలో ప్రచురించబడింది. ఈ పుస్తకం అందరికీ అందుబాటులో ఉండదని భావించి అందులో పొందుపరిచిన కొన్ని ముఖ్యాంశాలని తెనుగులోకి అనువాదం చేసి 'కౌముది' మాసపత్రిక ద్వారా మీకు అందిస్తున్నాను.

ధారావాహికంగా వచ్చే ఈ ఉపాఖ్యానాలని మీరు చదివి, మీ పిల్లలకుకూడా తెలియచెప్పమని నా విన్నపం. ఈ విధంగా ఘనమైన మన భారతదేశ చరిత్ర భావితరాలకు కూడా చేరుతుందని నా చిన్న ఆశ..!!




**సనాతనధర్మం, వైదికధర్మం** అనబడే హిందూమతం మానవ నాగరికతకు, దార్శనికతకు పుట్టుకనిచ్చిందంటే అది అతిశయోక్తికాదు. వేలఏళ్ళక్రితమే ఇతర మతస్తులనుకూడా చాల ప్రభావితంచేసిదంటే వాళ్ళు ఒప్పుకోరు. కాని ఈవిషయం చరిత్రలో దాగియున్న సత్యం. ఈ ప్రభావం భారతీయ మతాలమీదే కాదు, భారతేతర మహ్మదీయ (Islam), క్రైస్తవ (Christianity), యూదు (Judaism), పారిశీక (Zoroastrianism) మున్నగు మతాలమీద కూడా పడింది. ఈ విషయాల గురించి క్రిందటి సంచికల్లో కొంతవరకూ తెలుసుకున్నాం..

### బౌద్ధమతం - 1

బుద్ధధర్మం అనికూడా పిలువబడే ఈ మతం 2,538 ఏళ్ళకు పూర్వం (క్రీ.పూ. 528 లో) సనాతనధర్మంలో ఒక శాఖగా ఉద్భవించింది. నిజానికి దీనికి ఆద్యుడైన బుద్ధుడు తన జీవితకాలంలో దీనిని ఒక మతరూపంలో స్థాపించలేదు. ఇది ఒక కొత్త మతమని కూడా భావించలేదు. ఆయన తాను ఒక హిందువుగానే భావించి సనాతనధర్మంలో ఒక క్రొత్త ఉరవడికి నాంది పలికాననుకున్నాడు. అంటే వైష్ణవ, శైవ శాఖలలాగా. కాని బుద్ధుడు తనువుచాలించిన తదుపరి ఈయన సిద్ధాంతాలను శిష్యులు క్రోడీకరించారు. ఆ తరువాత కొన్నివందల సంవత్సరాలకు ఈ శాఖకు ఒక మత రూపం ఇవ్వడంజరిగింది.

## సిద్దార్ధుడు, ఆయన బాల్యం

బుద్ధుడుగా ప్రఖ్యాతి గాంచిన 'సిద్దార్ధగౌతమ' ఇప్పటిబీహార్‌లోని కపిలవస్తునగరం రాజధానిగాఉన్న 'శాక్య'రాజ్యాన్ని పరిపాలించిన శుద్ధోదనుని భార్య మాయాదేవికి క్రీ.పూ.563 లో లుంబిని దగ్గర జన్మించాడు. స్వర్గం నుండి దిగివచ్చినట్లుగా ఉన్న ఒక తెల్లటి ఏనుగు భవంతి పైకప్పునుంచి దిగి తన గర్భంలోనికి ప్రవేశించిన అనుభూతి ఆ మహాతల్లికి కలలో కలిగిందట. గర్భంలో ఉన్న ఈ బోధిసత్వుడు తాను జన్మించేవరకు ధ్యానముద్రలోనే ఉన్నాడట!

మాయాదేవి ప్రసవం దగ్గరైనప్పుడు కపిలవస్తు నుండి తల్లి-తండ్రులున్న లుంభినీకి రథంలో ప్రయాణించింది. దారిలోనే అడవిలో పురిటి నెప్పులు మొదలయినాయి. వెంటనే ఒక 'శాల' చెట్టు నీడలో విశ్రాంతితీసుకొన్నప్పుడు కొంతసేపటికి సిద్దార్ధునికి జన్మనిచ్చింది. ఈ సిద్దార్ధుడు పుట్టినవెంటనే నిలుచున్నాడని ప్రతీతి. జననం తదుపరి మాయాదేవి పుత్రునితో కపిలవస్తుకి తిరిగి వెళ్ళిపోయింది. ఆతరువాత 7 రోజులకు ఆమె చనిపోయింది. మాయాదేవి చెల్లెలు, శుద్ధోదనుని వేరొకభార్య 'మహాప్రజాపతి గౌతమి' సిద్దార్ధుడుని పెంచింది.

సిద్దార్ధుడు పుట్టినప్పటినుండి 29 సంవత్సరాలు రాజప్రాసాదం విడిచి బయటకువెళ్ళకుండా ఎప్పుడూ దీర్ఘాలోచనల్లో మునిగి యుండేవాడు. ఒకరోజు తోటలో తిరుగుతున్నప్పుడు ఒక ముసలివాడిని, తరువాత వరుసగా మూడురోజులలో మూడు దిక్కులలో మృతదేహాలను చూశాడు. ఇంకొక రోజున నాలుగవదిక్కులో ఒక సన్యాసి యాచించటం చూశాడు. ఆ తరువాత సంధ్యచీకట్లో - ఆకాశంలో మంటనుండి వెలువడే ఒక ప్రకాశవంతమైన వెలుగును చూశాడు. అప్పుడు ఈ జనన-మరణాలకు కారణమేంటి? వీటినుంచి రాహిత్యం, విముక్తిలేదా? ఏంచేస్తే మానవుడు విముక్తుడౌతాడు? ఇటువంటి ఆలోచనలలో మునిగియున్నాడు. చివరకు భవంతిలోకి వెళ్తే అక్కడ ఒక వార్తాహరుడు కనిపించి యువరాణి 'యశోధర' పుత్రునికి జన్మనిచ్చిందని చెప్పాడు. "రాహుల పుట్టాడు, మరో బంధం ఏర్పడింది" అని గొణుగుతూ లోపలకు వెళ్ళాడు.

తననుగమనిస్తున్న బాల్యస్నేహితురాలు 'క్రుశగౌతమి'ని చూసి ఆమెకు ఒక మణికంటహారం నౌకరుద్వారా పంపించి తన మందిరంలోకి వెళ్ళి దీర్ఘాలోచనలో మునిగిపోయాడు. ఆ తరువాత ఒక నిర్ణయానికి వచ్చి భార్యమందిరంలో ప్రవేశించినప్పుడు యశోధర రాహుల నుదిటిమీద చేయివేసి నిద్రపోవటం చూశాడు. నూనెదీపం కాంతిలో కనీకనపడని పుత్రుణ్ణి మొదటిసారి, చివరిసారిగా చూడాలనిపించింది. కాని భార్యచేతిని తొలగిస్తే ఆమెలేచి తన ప్రయాణాన్ని ఆపవచ్చనే భయంతో చూడకుండా బయటకువెళ్ళి పోయాడు. ఆ తరువాత కొంతసేపటికి రథసారధి 'చన్న'ను తోడు తీసుకుని రథమెక్కి అడవిలోకి వెళ్ళిపోయాడు సిద్దార్ధుడు....

## జ్ఞానోదయం ఎలాజరిగింది?

ఆకాలంలో సనాతనధర్మంలో 62 తత్వ, వేదాంత శాఖలున్నాయి. వీటిల్లో 6శాఖలలో ఆరుగురు ప్రఖ్యాతి గాంచిన పండితులున్నారు. పురాణకాశ్యపుని దృష్టిలో క్రియవల్ల ప్రతిక్రియ ఉండదు. మస్కారిన గోపాలిపుత్ర వాదంప్రకారం మానవుని ఉనికి, జీవితం పుట్టినప్పుడే నిర్ణయమైపోయాయి. ఇంకావాటికోసం ప్రాకులాడటం వ్యర్థం. అజిత కేశకంబలి అయితే మానవుడు నాలుగు మూలకాలతో పుడతాడు, కాని అవి మరణంతోనే విడిపోతాయి అని వాదించాడు. కకుడ కాత్యాయన అయితే మానవునిలో ఏడు శాశ్వతముగాఉండే మూలకాలున్నాయి అంటూ, ఒకవ్యక్తి హత్యచేయబడితే హంతకుడూలేడు, హత్యాలేదు, హత్యగావించబడినవాడూలేడు. అంటే అంతా మిధ్యే అని అన్నాడు! సంజయి విరతీపుత్రుడు 'అధిభౌతికత'(metaphysics) గురించిన అన్వేషణలో ఒక ఖచ్చితమైనజవాబు దొరకదనే సిద్ధాంతవాది. ఇక జీన మహావీర (జైనమతాచార్యుడు) క్రితజన్మలలోచేసిన నేరాలు, పాపాలు కడిగేసుకొటానికి ప్రతిజన్మలోనూ ప్రాయశ్చిత్తంచేసుకోవాలి అంటాడు.

కానీ ఏఒక్కటీ సిద్దార్థుని జ్ఞానతృష్ణను తీర్చలేకపోయింది. 'ఉరువిల' అనబడే కీకారణ్యంలో గమ్యంలేకుండా సంచరిస్తూ ఒకచెట్టు మొదలులో ఆసీనుడయ్యాడు. 6 సంవత్సరాలు ధ్యానంలో మునిగియున్న ఆయనకు చివరకు కీ.పూ. 528లో ఒకశుభోదయాన జ్ఞానోదయం కలిగింది. కాని దీనికిముందు ఆయన ఉచ్ఛ్వాసనిశ్వాసాలు కొలిమితిత్తి నుండి బయటకువచ్చే వేడిగాలులలాగా ఉన్నాయి. ఆతరువాత భయంకరమైన తలనొప్పి, వెంటనే భరించలేనంత వేడి అధికమైయ్యాయి. ఆయన కపాలం ఎండబెట్టిన గుమ్మడి కాయలాగా ముడుచుకు పోయింది. ఏదో తెలియని ఒక ప్రతిమ రూపం కనపడింది.

ఆయన మనస్సులోకి ఇంకొక రూపం కూడా వచ్చింది.. రెండు పచ్చికొమ్మలను ఒకదానితోఒకటి, అలాగే రెండుతడికొమ్మలను, రాపిడిచేస్తే రాని నిప్పు, రెండు ఎండుకొమ్మలతో సాధ్యపడింది. ఎలా? ఆయన ధ్యానాలోచనలో మానవునిలో లైంగికానందం వున్నట్లే నిప్పురాజేసిన ఎండుకొమ్మలలో అగ్ని నిక్షిప్తమైవుంది. ఎండుకొయ్యల రాపిడితోనిప్పు రాజేసినట్లే విశ్వంలోవున్న కామోత్తేజక రాపిడే మానవాళి పుట్టుకకు మూలస్తంభం అనిఅర్థమైంది. ఒకరోజు ధ్యానంలోనుండి పూర్తిగా శుష్కించిన శరీరంతోఉన్న సిద్దార్థుడు లేచి దగ్గరి గ్రామంలో అందరూ తినే ఆహారంకోసం ఒక సామాన్య ప్రయాణికునిలా యాచించాడు. మరల తిరిగివచ్చి ధ్యానంలోమునిగిపోయాడు.

ధ్యానం ఇంకాపూర్తవలేదు. కీ.పూ. 528మే నెలలోని పౌర్ణమి రాత్రి అయిదుకలలువచ్చాయి.

ఒక కలలో ఉరువిలారణ్యంలో ఎన్నడూచూడని "సుజాత అనే యువతి ఒక బంగారుగిన్నె ఇచ్చింది. దీనిని నదిలోవిసిరేసి" ఇది ప్రవాహానికి ఎదురీదితే ఈరోజు నేను బుద్ధుడుని అవుతాను" అని అనుకున్నాడు. అయితే గిన్నె నదిమధ్యలోకి వెళ్ళి ఒకగుర్రం నీట్లో బల్లెంలాగా దూసుకుపోయినట్లుగా బిరాబిరా అలల శిఖరాగ్రంచేరి సుడిగుండంలో కొట్టుకుపోకుండా మాయమైపోయింది. ఆ సమయంలో ఈగిన్నె నది అట్టడుగున నీటిమొక్కలతో నిండి ఉన్న మూడుగిన్నెలతో ఢీకొట్టిపడిపోయింది. వేల సంవత్సరాలుగా అలా ఉండిపోయిన ఈ మూడు గిన్నెలు పూర్వం ముగ్గురి బుద్ధులకు చెందినవట ! కాని ఈగిన్నె వీటికి దూరంగాపడి బురదమట్టిలో స్థిరపడిపోయింది.

ఇలాంటికలలు ఎన్నోవచ్చాయి. రాత్రి బుద్ధునికి తన పూర్వజన్మల గురించి ఒక కల వచ్చింది. తన ప్రతిరూపాన్ని చూసుకుని "అది నేనే" అనుకున్నాడు. అకస్మాత్తుగా ఇతరుల పూర్వజన్మలను కూడా చూశాడు. ప్రతిరూపంలోని ఆనందం, బాధను చూశాడు. తనజీవిత దృశ్యాలను, ఇతరుల జీవితాల దృశ్యాలనూ ఒకదాని ప్రక్కనొపెడితే, అవి అన్నీ అతుక్కుపోయి చెరువంతా దట్టంగా ఆకులతో నిండినట్లుగా ఉన్నాయి. ఇంకా ఎన్నెన్నోరూపాలు, దృశ్యాలు కనపడ్డాయి. అర్థరాత్రి దాటిన తరువాత జ్ఞానోదయం కలిగింది. అట్లా సిద్దార్థుడు బుద్ధుడయ్యాడు. బుద్ధునిని బోధిసత్వుడు అని కూడా అంటారు.

## జ్ఞానోదయం తరువాత పరీక్ష

జ్ఞానోదయం తరువాత బుద్ధుడు ఏడురోజులు అలాగే కూర్చునిఉన్నాడు. ఎనిమిదో రోజు ఉదయం లేచి తనకుఇన్ని సంవత్సరాలు నీడ, రక్షణ ఇచ్చిన బోధి వృక్షాన్ని మరో ఏడురోజులు పరీక్షగా చూశాడు. తరువాత వడివడిగా నడవసాగాడు. దారిలో 'మార'అనే రాక్షసవేషంలో ఉన్న వ్యక్తి తనభటులతో దాడిచేస్తే బుద్ధుడు ఒక్కసారి దగ్గి అరచేతిని నేలమీద రుద్దితే వారంతాపారిపోయారు. 'మార' వెంటనే తనకూతుళ్ళు 'తంత్రి', 'ఆరతి'ని ఈయనను ఆకర్షించటానికి పంపించాడు. ఈ యువతులు ఆయన వెంట నడుస్తూ ఎన్నివిధాలుగా ప్రయతించినా వారి ఉనికినే గుర్తించకుండా వడివడిగా అడుగులువేస్తున్నాడు. వారి మాటలను కూడా వినటంలేదు. నిస్పృహతో ఆరతి ఇలా అంది: "నీవుఅంతులేని విచారంతో మునిగిఉన్నావా? ఇంతఒంటరిగాఉండటానికి వేరే కారణం వుందా?" దానికి బుద్ధునిసమాధానం: "నేను విచారానికి హేతువైన మూలవేరుని సమూలంగా నశనంచేశాను." ఇలా చాలా ప్రశ్నలడిగింది. కాని బుద్ధుడు లొంగలేదు.

గొప్పగా పొగిడితేలొంగుతాడనుకుని ఆరతి ఇలాఅంది: "అదేఅయితే అనేకమంది నీ వెంట వుంటారు. నిన్ను అనుసరిస్తారు. ఇప్పటికే చాలామంది నీ వెంటవుండాలనే ప్రయత్నంలో ఉన్నారు." బుద్ధుడు: "నీవు నీ గోళ్ళతో కొండను గీకాలనుకొంటున్నావు. నీవు ఇనుముని కొరకాలనుకుంటున్నావు. నేనంటే అసూయలేకపోతే ఎందుకు నా వెంట పడుపడుతున్నావు?" ఇలా ఎన్నో విధాలుగాప్రయత్నించినా బుద్ధుడిని లోబరచుకోలేక పోయారు ఆ ఇద్దరు యువతులు. చివరకు వాళ్ళు తలలు వంచుకుని తండ్రివద్దకు వెళ్ళారు. అప్పుడు ఆరతి "తండ్రీ, మేము ఓడిపోయాం" అంటే మార ఇలాఅన్నాడు: "ఆయనమిమ్ములను నూలుపోగులలాగా తేసివేశాడు. ఆయనదేవుడేమో." వెంటనే వారు అదృశ్యమైపోయారు. మార రూపంలోఉన్నవాడు స్వార్ధం, పగ, దురాశ, మూడత్వం, అసూయ, అవిద్యలకు ప్రతీక. బుద్ధుడు వీటికి అతీతుడా, లేదా అనితెలుసుకోటానికి దైవం పెట్టిన పరీక్షా?

## బుద్ధుని సిద్ధాంతాలు.

బుద్ధుని ప్రవచనాలు విశ్లేషాత్మకంగానూ, పునరావృతంగానూఉంటాయి. జన్మత హిందువయిన ఈయన ప్రవచనాలు కేవలం రెండు పదాలచుట్టూ తిరుగుతాయి. అవి సనాతనదర్మమూలాలయిన 'ధర్మం', మోక్షం'. కాని ఆయన వాడిన పదాలు ' ధర్మం', 'నిర్వాణం'. వీటిని సాధించేమార్గాలూ వేరు. అవి జన్మ-మరుజన్మ పునరావృతికి సంబంధించిన నాలుగు ఉదాత్తమైన సత్యాలు (Noble Truths), వీటి సహాయంతో నిర్వాణం పొందటానికి కావలసిన 'ఎనిమిదిమార్గాలు' (Noble Paths).

నాలుగు సత్యాలు ఇవి: దుఖం (suffering), సముదాయం (cause or origin of suffering), నిరోధం (prevention of suffering) , మార్గం (path to remove suffering). సముదాయం అంటే దుఖానికి గలకారణం. ఇదే మానవులను ఈ ప్రపంచంతో ముడివేసి పునర్జన్మలకు కారణమవుతుంది. దీనిని 'నిరోధిం'చటానికి బుద్ధుడు సూచించిన ఎనిమిది మార్గాలు: నిజమైన వివేకం (understanding), ఆలోచన (thought), వాక్కు (speech), క్రియ (action), జీవనం (livelihood), ప్రయత్నం (effort), మనస్సు (mindfulness), ఏకాగ్రత (concentration).

ఆ కాలపు హిందూమత పెద్దలు 'బలి' అనే మాటను విరివిగా ఉపయోగించేవారు. కాని బుద్ధుని మాటలలో ఈ పదం ఉండేది కాదు. అసలు బలి అంటేచాలా వ్యతిరేకించారు. అంతేగాక, ఆయన బోధనలలో ఇతర హిందూవాదుల ప్రస్తావనే ఉండేది కాదుకూడా. అయిష్టమైన పదాలు, వాక్యాల గురించి ఆయనమాటలలో ఉండేదికాదు. ఆకాలపు హిందూమతంలో నూతన ఆలోచనలను రేకెత్తించాడు. ఛాందోగ్య ఉపనిషత్తులోని వేదంతసారపు మహావాక్యం 'తత్వం అసి', అనేపదంతోపాటు 'ఆత్మ' విషయంలో కూడా బుద్దుడు విభేదించాడు.

## బుద్ధునిశిష్యులు

బుద్ధునికి అయిదుగురుశిష్యులు ఉండేవారు. వీరిలో ఇద్దరు శారిపుత్రుడు (బుద్ధుడి మేనత్తకొడుకు, ఒకప్పుడు పరమ విరోధి అయిన దేవదత్తుని అనుయాయుడు), మౌద్గలయాయనుడు సిద్దార్థుడి మార్గం నచ్చక వేర్వేరుగా సత్యాన్వేషణకు బయలుదేరారు. కాని వీరు చివరకు బుద్ధుడికి శరణాగతులయ్యారు. మౌద్గలయాయనికి అద్భుతమైన తాంత్రిక శక్తులున్నాయి. బుద్ధుడు వీటిని వ్యతిరేకించినా, ఈతను తనశక్తులను ధర్మబోధనకు ఉపయోగించాడు. మహాయాన సాంప్రదాయంలో 'ఉలంబన'ఉత్సవం ఈయనపేరున జరుగుతుంది. అశ్వజిత్ కొన్నిసంవత్సరాలు సత్యాన్వేషణచేసి ఫలించక చివరకు బుద్ధుని బోధనలతో ప్రభావితుడై, సన్యాసిఅయి పరమశిష్యుడయ్యాడు.

'ఆనంద' బుద్ధుడి బాబాయి 'అమితోదన' కొడుకు. ఆనందుని 20వ ఏట 'జానపదకళ్యాణి'తో వివాహం కుదిరింది. కాని పెళ్ళికి కొద్దిరోజులకు ముందే జ్ఞానోదయమయిన తరువాత బుద్ధుడు కపిలవస్తు వెళ్ళినప్పుడు, ఆనంద తన ఆరుగురు మిత్రులు, మంగలి 'ఉపాలి'తోకలిసి ఆయనతో వెళ్ళిపోయాడు. అప్పటినుండి 20ఏళ్ళు బుద్ధుడి సేవకుడిగా ఉన్నాడు. తరువాత బుద్దుడి 55వ ఏటనుండి 25ఏళ్ళు ఆయనకు ఏకైక ముఖ్య కార్యదర్శిగా ఊన్నాడు. ఆనందునికి అమోఘమైన జ్ఞాపకశక్తి ఉంది. బుద్ధుని

ఫోటినుండి వచ్చిన 82వేల ప్రవచనాలు, సిద్దాంత వ్యాఖ్యానాలు జ్ఞాపకంపెట్టుకున్న ప్రజ్ఞావంతుడు. ఇవేకాక, ఇతరులనుంచి విన్న 2వేల ప్రవచనాలు కూడా. అందుకే ఈయనను 'బహుశృత' అని అంటారు. అట్లాగే బుద్ధధర్మాన్ని కాపాడిన వాడుగా పేరు పొందాడు. కాని ఈయన బుద్ధుని నిర్వాణంపొందిన కొద్ది రోజులతర్వాత తన 65వ ఏట జ్ఞానిగా గుర్తింపబడ్డాడు. 85వ ఏట బుద్ధుని అధికారిక వారసుడయ్యాడు. 120వ ఏట పరమశత్రువులైన మగధ, వైశాలి రాజ్యాలలో దేంట్లోనూ నిర్వాణం పొందటానికి ఇష్టపడక రెండిటికి మధ్యలోఉన్న గంగానది మధ్యలోకివెళ్ళి నిర్వాణమవటం జరిగింది. ఈ విధంగా ఈ రెండురాజ్యాలకు మిత్రత్వం కుదిర్చాడు.

బుద్ధుడి అయిదవ ప్రముఖ శిష్యుడు'మహాకశ్యప'. ఈయన అందరి శిష్యులకంటే పెద్దవాడు. బుద్ధుడి తరువాత ఆయన బౌద్ధధర్మానికి వారసుడయ్యాడు. బుద్ధుడికాలంలో ఈయనకు మనస్సును మూసివేయగల సామర్ధ్యమున్నందువల్ల 'జెన్'శాఖకు మూలపురుషుడుగా గుర్తించబడ్డాడు. ఈ జెన్ గురించి ఇంకో సంచికలోచర్చిద్దాం.

ఈ అయిదుగురితో పాటు, బుద్ధుడి పుత్రుడు రాహుల కూడా ఒకముఖ్య శిష్యుడే. బుద్ధుడు కపిలవస్తు వెళ్ళినప్పుడు యశోధర తన 7 ఏళ్ళ కొడుకుతో ఇలాఅంది: "నీవు నీ తండ్రి దగ్గరకువెళ్ళు. వెళ్ళి నీ వారసత్వం అడుగు." ఆ మహాజ్ఞాని రాహులుని వెంటనే 'ఆరంభకసన్యాసి'(novice monk) నిచేసి తనవెంట తీసుకువెళ్ళాడు. ఈ రాహులుడే భవిష్యత్తులో ఒక రహస్య (esoteric) మైన, సుభోదంకాని (abtruse) భౌద్ధమతానికి ఆరంభికుడయ్యాడు. ఇది చివరకు'టిబెటిన్' బౌద్ధశాఖగా మారింది.

### ఆమ్రపాలి భిక్షుకిగా ఎలామారింది?

ఒకసారి బుద్ధుడు వైశాలినగరంలో ఆమ్రపాలికి చెందిన మామిడివనంలో 1,250మంది శిష్యులతో పరివేష్టితుడయ్యాడు. వారితో ఇలా అన్నాడు: "ఈరోజు ఆమ్రపాలి వస్తుంది. ఆమెఅసమానమైన అతిలోకసౌందర్యవతి. అందువల్ల మీరు అచంచల చిత్తులవ్వకండి. ఆమె అంటే చులకన భావం ఉండకూడదు. మీమనస్సులను మీ స్వాదీనంలో ఉంచుకోడి. శరీరం నిప్పులాంటిది. అదిబూడిదతో కప్పబడి ఉంటుంది. ఇదితెలియక మూర్ఖులు దానివేంటపడతారు. అది గుర్తుంచుకోండి."

ఆమ్రపాలి వైశాలిరాజ్యంలో లిచ్ఛవి రాజ్యపు రాజనర్తకి. ఆమె ఎంత సౌందర్యవతంటే మగధరాజు బింబిసారుడు - ఆమెను పొందాలనే కాంక్షను మారు వేషంలో వెళ్ళి తీర్చుకున్నాడు. వైశాలిమీద దండెత్తినసమయంలో ఒకరాత్రి సైనికుని వేషంలో నగరంలో ప్రవేశించి కొద్దిరోజులు ఆమెతో గడిపివచ్చాడు. వీరికి కలిగిన పుత్రుడు విమల కుందన (కొండన) చివరకు బుద్ధునిబాటలో నడిచాడు.

500మంది చెలికత్తెలతో ఆమ్రపాలి వస్తుంటే బుద్ధుడి పరివారమంతా తలలు వంచుకుని నిలబడింది. ఆమె బుద్ధుడి కాళ్ళకు నమస్కరించి ఒక పీటమీద కూర్చుంది. అప్పుడు బుద్ధుడు ఇలాఅన్నాడు: "ఎందుకువచ్చావు?" ఆమె: "మీరుస్వర్గంలోకూడా గౌరవించబడినందువల్ల" "నేను చేసేపని నీకు నచ్చిందా?" "లేదు. కాని దేవుళ్ళు నిర్దేశించినందువల్ల నచ్చింది." బు: "500మంది స్త్రీలను ఎందుకు నీదాసీలుగా ఉంచుకున్నావు?" ఆమె: "వారుబీదవారు. అందుకని వారిని రక్షించి ఆదుకుంటున్నాను." బుద్ధుడు కొంతసేపు మాట్లాడక చివరకు "ఇదినిజంకాదు" అన్నాడు. ఇట్లాసంభాషణ జరిగిన తరువాత కొంతసేపటికి ఆమ్రపాలి "నాకు మీశిష్యురాలు అవ్వాలని ఉంది" అని అంది. బుద్ధుడినుండి సమాధానం రాలేదు. చివరకు బుద్ధిడికి నమస్కరించి వెళ్ళబోతూ "నా వాంఛ మీరు మీసన్యాసులతో కలిసి నా ఇంటికి వచ్చి నా ఆతిథ్యం పొందాలి" అని అంది. మారుమాట్లాడకుండా బుద్ధుడు అంగీకరించాడు.

తరువాత కొద్దిరోజులకు బుద్ధుడు శిష్యసమేతంగా ఆమ్రపాలి ఇంటికివెళ్ళాడు. ఆయనకు సకలమర్యాదలు చేసిన తరువాత ఆమె అన్నీ త్యజించి, కాషాయవస్త్రాలు ధరించి తలనీలాలు తీసివేసి బుద్ధుని భిక్షుకి-శిష్యురాలుగా మారి ఆయన వెంట నడిచింది. ఇది జరిగే ముందు తాను పుట్టిన, తనదైన మామిడివనాన్ని బుద్ధుడికి కానుకగా సమర్పించింది.

**శాక్యులమీదమారణకాండ.**

బుద్ధుడు అనేక చోట్ల బోధనలు చేస్తూ ఒకసారి తన శాక్యరాజ్యానికి వెళ్ళాడు. అక్కడకు వెళ్ళేముందు ఆయనకు ా అమితవిచారం, భరించలేనంత తలనొప్పి వచ్చింది. ఆ సమయంలోనే ఆయన బంధువులందరు ఒకరితరువాత ఒకరు కోసలదేశపురాజు విరూధరుడు, ఆతని సైన్యంచేత చంపబడుచున్నారు. శాక్యులు విలువిద్యలో చాలా ఆరితేరినవారు. కాని బుద్ధుడి బోధనలతో ప్రభావితమైన వీరు ప్రత్యర్థులను చంపటానికి అయిష్టత కారణంగా వారిబాణాలలో వాడితగ్గింది. చివరకు శత్రువుల చేతిలో మారణకాండననుభవించారు. దీనికికారణం శాక్యులు ఈ కోసలరాజుని చిన్నప్పుడు 'దాసీపుత్రుడని' అవమానం చేసారు. ఆపగ ఈ విధంగాతీర్చుకోవటంజరిగింది.

ఈ మారణహోమం జరిగిన తరువాత బుద్ధుడు వెళ్ళిచూస్తే, తాను, ఆనంద, రాహుల, ఇంకా కొద్దిమంది ప్రముఖశాక్యులు తప్ప ఎవరూ బ్రతికిలేరు. దీనికి ఆయన ఏమాత్రం చలించలేదు, మాట్లాడలేదు. చివరకు ధర్మమే జయించినట్లు, తిరిగివెళ్తున్న సైన్యంతోపాటు విరూధరుడు కూడా 'అచిరవతీ' నదిలో మరణించారు. వీరు నదిని దాటున్నప్పుడు, చాలాకాలంగా ఎండిపోయిన ఆ నది ఇసుకమేటల మధ్య విశాంతి తీసుకున్నడు అర్ధరాత్రి సమయంలో అకస్మాత్తుగా పొంగి ఈ అధర్మవర్తనులను తనలో కలిపివేసుకుంది!

(బుద్ధునినిర్వాణం, ఆయన ప్రవచనాల క్రోడీకరణ, ఈ మతవ్యాప్తిలో అశోకునిపాత్ర, వివిధశాఖలు మొదలైన వివరాలు వచ్చేనెలలో తెలుసుకుందాం.)

మీ అభిప్రాయాలను పంపించేందుకు నా ఇ-మెయిల్: dr_vs_rao@yahoo.com; ఫోన్: 916-714-7405 (U.S.A.)

